www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 6 సెప్టెంబర్ 2025

5


తిరుపతి



టీటీడీకి రూ.కోటి విరాళం

ప్రజాశక్తి - తిరుమల

టీటీడీ శ్రీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి బెంగళూరుకు చెందిన ఓ అజ్ఞాత భక్తుడు శుక్రవారం రూ.1,00,50,000 (ఒక కోటి యాభై వేల రూపాయలు)ను విరాళంగా అందించారు. ఈ మేరకు దాత విరాళం డీడీని తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బీ.ఆర్.నాయుడుకు అందజేశారు.



తిరుపతి కచ్చపి ఆడిటోరియంలో...



శ్రీకాళహస్తి యుటిఎఫ్ ఆధ్వర్యంలో

సమాజ దిక్సూచి గురువు

● నూతన బోధనా పద్ధతులు అవలంబించాలి ● ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

'సమాజ దిక్సూచి గురువని, నూతన బోధనా పద్ధతులు అవలంభించాలని, ప్రతి విద్యార్థి పట్ల వ్యక్తిగత శ్రద్ధ చూపాలి' అని వక్తలు ఉద్ఘాటించారు. గురుపూజోత్సవం సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. గురుపూజోత్సవ వేడుకలను తిరుపతి కచ్చపి ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించారు. తిరుపతి, నగరి ఎంఎల్ఎలు ఆరణి శ్రీనివాసులు, భానుప్రకాష్, శాప్ ఛైర్మన్ రవినాయుడు, యాదవ్ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ ఛైర్మన్ సుగుణమ్మ, డిప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, ఆర్‌సి మునికృష్ణ, జిల్లా విద్యాశాఖ అధికారి కెవిఎన్ కుమార్, సమగ్ర శిక్ష అడిషనల్ కోఆర్డినేటర్ శంకర్‌రావుతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ దేశ, రాష్ట్ర ప్రగతిలో ఉపాధ్యాయుల సహకారం ఎంతో ఉందన్నారు. ప్రతి విద్యార్థినీ వృత్తిపరంగా కాకుండా విద్యార్థుల పట్ల వ్యక్తిగత శ్రద్ధ ఉన్నపుడు వారి మధ్య బంధం పెరుగుతుందన్నారు. విద్యార్థులకు చదువు పట్ల నమ్మకం పెంచి వారి ప్రవర్తనలో మార్పు వచ్చేలా, ప్రేరణ కలిగించే బాధ్యత ఉపాధ్యాయుల్లో ఉందన్నారు. సర్వేపల్లి రాధాక్రిష్ణ ఒక తత్వవేత్తని, ఉపాధ్యాయ వృత్తికి, రాష్ట్రపతిగా దేశానికి వన్నె తెచ్చారన్నారు. మారుతున్న విద్యా ప్రమాణాలకు అనుగుణంగా వినూత్న పద్ధతిలో విద్యార్థులకు బోధన జరిగితే దీర్ఘకాలిక లక్ష్యాలను చేరుకోవచ్చున్నారు. పాఠశాల అభివద్ధికి ఉపాధ్యాయులందరూ ఒక్కటై కృషి చేసినట్లయితే మంచి ఫలితాలు సాధించవచ్చున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి 50 కోట్ల బడ్జెట్ కేటాయిస్తూ ప్రతి క్లాస్ కు ఒక టీచర్ ఉండాలన్న లక్ష్యంతో మోడల్ స్కూల్ ఫౌండేషన్ ఏర్పాటు చేసిందన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 68 మంది ఉపాధ్యాయులకు ఘన సన్మానం చేసి ప్రశంసా పత్రాలను అతిధులు అందించారు.

యుటీఎఫ్ ఆధ్వర్యంలో గురువులకు సత్కారం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

మంచి సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుడు దిక్సూచిగా నిలుస్తున్నాడని యూటీఎఫ్ శ్రీకాళహస్తి డివిజన్ కన్వీనర్ సీ.వెంకటకష్ణ పేర్కొన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్ లో శుక్రవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకష్ణన్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి డివిజన్ పరిధిలో విద్యాభివద్ధికి పాటు పడిన ఉపాధ్యాయులు జయప్రకాష్, ముద్దు కష్ణ, రవీంద్రా రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, నటరాజన్, విజయ్ భాస్కర్, పుష్పలత, వాసవీ లత, సుమతి, మార్టిన్, సంబంధం శెట్టి, లక్ష్మీ ప్రసాద్, విజయరాణిలను ఘనంగా సత్కరించి, యుటీఎఫ్ పురస్కారాలను అందజేశారు. యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు, కార్యవర్గ సభ్యురాలు డి.నిర్మల, రామచంద్రయ్య, హేమాంభరదరరావు, సూర్యప్రకాష్, జీ. శ్రీనివాసులు, మధు, మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ టౌన్‌షిప్‌గా శెట్టిపల్లి

అక్టోబర్ 15 నాటికి పట్టాలు

ప్లాటుదారులకు రెండు సెంట్లు

మీడియాతో కలెక్టర్ వెంకటేశ్వర్



శెట్టిపల్లి భూ సమస్య పరిష్కారమయ్యిందని ప్రకటిస్తున్న కలెక్టర్, ఎంఎల్ఎ, తుడా ఛైర్మన్, కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

సుదీర్ఘకాలంగా ఉన్నటువంటి శెట్టిపల్లి భూముల సమస్య నేటితో పరిష్కారం అయ్యిందని, రాజకీయ, పరిపాలనాపరమైన సహకారంతో సాధ్యపడిందని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. శెట్టిపల్లి ల్యాండ్‌పూలింగ్ పద్ధతిన పరిష్కరించే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చర్యలు చేపట్టారన్నారు. కలెక్టరేట్‌లో విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ శెట్టిపల్లి భూముల సమస్య క్యాబినెట్‌లో ఒకే అయ్యిందని, రెండు మూడు రోజుల్లో జీవో వస్తుందని చెప్పారు. శెట్టిపల్లిలో ఉన్న హౌస్‌హోల్డ్ ఓనర్లకు 50:50 రేషియోలో, అగ్రికల్చర్ ల్యాండ్ ఓనర్లకు 30:70 రేషియోలో హక్కులు కల్పిస్తామన్నారు. తుడాకు 65 ఎకరాలు, ప్రభుత్వానికి 90 ఎకరాలు వచ్చేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఇంటర్నల్ రోడ్లు, మాస్టర్‌ప్లాన్‌రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజి, ఎలక్ట్రిసిటీ, పార్కుల కోసం స్థలం కేటాయించామన్నారు. తుడా 200 కోట్లు పెట్టుబడి పెట్టి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అంతా 225 ఎకరాల్లో ఏర్పాటు చేస్తారన్నారు. అదేవిధంగా ప్రభుత్వానికి 90 ఎకరాల్లో హై క్లాస్ వరల్డ్ క్లాసు ఇన్ఫ్రాస్ట్రక్చర్ టూరిజంకు, ఇతరత్రా ప్రధాన ప్రాజెక్టులకు తీసుకొచ్చి తద్వారా భూముల విలువ పెరిగే విధంగా చర్యలు చేపడతామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హౌసింగ్ పాలసీ ప్రకారం అర్బన్ ప్రాంతంలో రెండు సెంట్లు ఇస్తున్నామని, శెట్టిపల్లి వారికి సెంటున్నర ఇస్తే అన్యాయం జరుగుతుంది కనుక వారికికూడా రెండు సెంట్లు ఇచ్చే విధంగా ప్రజా ప్రతినిధులకు తెలుపగా. ముఖ్యమంత్రి రెండు సెంట్లు ఇవ్వాలని ఆదేశించారన్నారు.జిల్లా ఇన్‌ఛార్జి మంత్రివర్యులు, రెవెన్యూ శాఖ మంత్రివర్యులు కృషి చేశారన్నారు. 1300 పైచిలుకు మందికి రెండు సెంట్లు స్థలం వచ్చే అవకాశం ఉందని, మిగిలిన వారికి కూడా రెండు సెంట్లు కేటాయిస్తామన్నారు. 2,500 కుటుంబాలు దీనిద్వారా లబ్ది పొందుతారని తెలిపారు. ప్రస్తుతం శెట్టిపల్లిలో స్వేర్‌యార్డ్ 20వేలు మార్కెట్ ధర పలుకుతోందని, 225 ఎకరాలకు 2వేల కోట్లు ప్రాపర్టీకి రిజిస్ట్రేషన్ చేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. గురువారం జరిగిన క్యాబినెట్ మీటింగ్‌లో శెట్టిపల్లి సమస్య ఓ కొలిక్కి వచ్చిందని, రెండు రోజుల్లో జీవో వచ్చే అవకాశం ఉందని అన్నారు. మొదట తుడా కు కేటాయించిన 65 ఎకరాల్లో పనులు మొదలుపెట్టి ఇన్ఫ్రాస్ట్రక్చర్ పనులన్నీ 30 నుండి 40 రోజుల్లో అక్టోబర్ 15 కల్లా పనులు పూర్తి చేసుకొని రెవెన్యూ ఇన్చార్జి మంత్రుల సమక్షంలో పట్టాలు పంపిణీ చేస్తామని అన్నారు . శెట్టిపల్లె భూ సమస్య పరిష్కారంలో శెట్టిపల్లి వాసుల శ్రమ ఎంతో ఉందని అన్నారు. ఒక మోడల్ టౌన్షిప్‌ను అభివద్ధి చేయాలని ముఖ్యమంత్రి ఆలోచిస్తున్నారని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో తిరుపతి ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు, మాట్లాడుతూ దాదాపు 227 ఎకరాల భూమిని లబ్ధిదారులకు ఇచ్చి లేఔట్లు వేసి, డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు, కరెంట్ సౌకర్యం కల్పిస్తామన్నారు. కమిషనర్ మౌర్య మాట్లాడుతూ ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని శెట్టిపల్లి భూముల సమస్యను పరిష్కరిస్తూ రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో శెట్టిపల్లి భూముల అభివృద్ధికి తుడాతో కలిసి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను, ఎంఎల్ఎను, తుడా ఛైర్మన్‌ను, నగర పాలక సంస్థ కమిషనర్‌ను లబ్ధిదారులు ఘనంగా సత్కరించారు.



నాడు శ్రీసిటీ ఉద్యోగి..నేడు పారిశ్రామికవేత్త

శ్రీసిటీలో 'స్మైల్ ఎకో' నూతన పరిశ్రమ ప్రారంభోత్సవం

ప్రజాశక్తి -వరదయ్యపాలెం

వ్యక్తిగత పరిశుభ్రత ఉత్పత్తులు (శానిటరీ న్యాప్‌కిన్స్) తయారు చేసే 'స్మైల్ ఎకో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్' నూతన పరిశ్రమ శుక్రవారం శ్రీసిటీలో ప్రారంభమైంది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో విఎస్ఎన్ఎల్ మాజీ ఛైర్మన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ఐటీ సలహాదారు, పద్మశ్రీ డాక్టర్ టి.హనుమాన్ చౌదరి ముఖ్యఅతిథిగా పాల్గొని, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ మల్లికార్జున పరుచూరి సమక్షంలో లాంఛనంగా పరిశ్రమను ప్రారంభించారు. 20 కోట్ల పెట్టుబడితో స్థాపించబడిన ఈ ప్లాంట్ ఏడాదికి 259.2 మిలియన్ ల శానిటరీ న్యాప్‌కిన్‌లను తయారు చేస్తుంది. దాదాపు 200 మందికి ఉద్యోగాలు లభిస్తుంది. స్థానిక ఉపాధి , మహిళల ఆరోగ్య అవసరాలకు దోహదపడుతుంది. దీని ఉత్పత్తులు దేశీయ మార్కెట్ తో పాటు విదేశాలకు ఎగుమతులు చేయబడతాయి. స్థానికుడు, నాడు శ్రీసిటీ ఉద్యోగి నేడు పారిశ్రామికవేత్తగా మారిన 'స్మైల్ ఎకో' ఎండీ మల్లికార్జునను ఈ సందర్భంగా డాక్టర్ సన్నారెడ్డి అభినందించారు.

శివగణేష్ వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి రేణిగుంటరోడ్డులోని గొల్లవానిగుంట క్రికెట్ గ్రౌండ్ నందు శివగణేష్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వాకర్స్ ఇంటర్నేషనల్ రీజినల్ కౌన్సిలర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆర్కాట్ కష్ణప్రసాద్ మాట్లాడుతూ వాకర్స్ యొక్క ఆరోగ్యపరిరక్షణ కొరకు వాకర్స్ అసోసియేషన్లు దోహదపడాలని, అందుకు అసోసియేషన్లోని ప్రతి సభ్యుడు కషి చేయాలని సూచించారు. ప్రతినెలా మెడికల్ క్యాంపు నిర్వహించి వాకర్స్ కు ఆరోగ్య అవగాహన పెంపొందించాలని తెలిపారు.తరువాత ప్రస్తుత అధ్యక్షుడు శంకర్ నాయుడు చేతులమీదుగా అధ్యక్షుడి పతకంను నూతనంగా అధ్యక్షునిగా ఎన్నికైన రాజేంద్ర ధరించి అధ్యక్షుని హెూదాను అందుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా శంకర్ రెడ్డి , శంకర్ నాయుడు , అధ్యక్షులు గా రాజేంద్ర, ఉపాధ్యక్షులుగా సుబ్రమణ్యం , కార్యదర్శి గా సోమశేఖర్ రాజు, కోశాధికారి రఘురామయ్య ,జాయింట్ సెక్రటరీ సుదర్శన్ బాబు లను ఎన్నుకున్నారు. నూతన అసోసియేషన్ కు 100 కుర్చీలను, టేబుళ్లను సభ్యులు విరాళం ప్రకటించారు.



ఆటోడ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఆటోడ్రైవర్లకు ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలు, సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యిందని, కార్మికుల రక్తాన్ని పట్టి పీడిస్తున్న పాలకులపై పోరాడాలని నాయకులు పిలుపునిచ్చారు. ఆటోడ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలన్నారు. వేమన విజ్ఞాన కేంద్రంలో ఆటోడ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం శుక్రవారం జరిగింది. యూనియన్ అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, గౌరవాధ్యక్షులు ఎస్.జయచంద్ర, ఎఐటియుసి ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి శివ, ఐఎఫ్‌టియు నాయకులు కుడుం విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎక్కువమంది ఆటో కార్మికులు డిగ్రీలు, పీజీలు చదివి ఉద్యోగాలు రాక ఆటోలు నడుపుకుంటున్నారన్నారు. ఓ వైపు స్త్రీ శక్తి పథకం వల్ల, మరోవైపు ఓలా, ఊపర్, రాపిడో వల్ల ఆటో కార్మికుల జీవితాలకు భద్రత లేకుండా పోయిందన్నారు. రవాణా రంగంలో తెచ్చిన మోటార్ వెహికల్ చట్టంలో మార్పులు తెస్తూ జీవో నంబర్ 21 వల్ల ఆటో కార్మిక కుటుంబాలపై పన్నుల భారం పడుతోందన్నారు. ఓలా, ఊపర్, రాపిడోలకు



సంబంధించి కార్మికులకు భద్రత లేకుండా పోయిందని, ప్రభుత్వ నిర్వహణలోనే ఒక యాప్ ఉండాలని డిమాండ్ చేశారు. ప్రతి ఆటో కార్మిక కుటుంబానికి 15వేల రూపాయలు ఇస్తామని ఎన్నికల ప్రచారంలో భాగంగా నారా లోకేష్ చెప్పారని, వాహనమిత్ర పథకం కింద ఎలక్ట్రికల్ ఆటోను జీరో పర్సంట్ వడ్డీతో తీసివ్వాలన్నారు. ఏ ఒక్క హామీ అమలు కాలేదని వాపోయారు. ఆటో కార్మికులకు భద్రత కల్పించాలంటూ సెప్టెంబర్ 15న కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం దిగిరాకపోతే 18న చలో విజయవాడ చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాధవ్‌కృష్ణ, జి.చిన్నబాబు, లోకేష్, బాదుల్లా, వాసు, గోపి, మణి పాల్గొన్నారు.

జైపూర్ రగ్స్ 'రగ్ ఉత్సవ్' ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి, టౌన్

జైపూర్ రగ్స్ 'రగ్ ఉత్సవ్' ప్రారంభించామని డైరెక్టర్ యోగేష్ చౌదరి తెలిపారు. ఈ రగ్ ఉత్సవంలో చేతితో తయారు చేసిన 14 వేలకు పైగా రగ్స్ ప్రదర్శనలో కలవన్నారు. భారతీయ నేతదారులు మన సంప్రదాయ ఆత్మను ఆధునిక డిజైన్‌తో తీర్చిదిద్దారన్నారు. ఈ సారి ఉత్సవం మరింత వైభవంగా ఉందన్నారు. ఈ ఏడాది రగ్ ఉత్సవ్ 2025లో ప్రత్యేకంగా ఎంపిక చేసిన కలెక్షన్‌లో ఆలం, జెనెసిస్, సవానా, కన్వోక్షన్, దా హాస్, వుండర్‌కమ్మెర్, కాలిడో, క్లాన్, బేసిస్, లాకునా, ఎర్బే, ఇండస్‌బార్, నోమాడిక్ థ్రెడ్స్, అకార్, కాంటూర్ వంటి సిగ్నేచర్ కలెక్షన్‌లు ఉన్నాయన్నారు. గ్రామీణ కళాకారుల ఊహాశక్తి నుంచి నేరుగా పుట్టుకొచ్చిన సుమారు 200 ప్రత్యేకమైన మంచాహా రగ్స్ కూడా ఈ వేడుకలో ప్రధాన ఆకర్షణ అన్నారు. ప్రపంచ వ్యాపార పరిస్థితులు మారుతున్న నేపథ్యంలో ఎగుమతులపై అధిక పన్నులు ఉన్న ఈ సమయంలో మొదటిసారి మొత్తం కలెక్షన్‌పై 60 శాతం వరకు తగ్గింపు అందిస్తున్నామని పేర్కొన్నారు.

ఘనంగా మేయర్ శిరీష పుట్టినరోజు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డాక్టర్ శిరీష జన్మదిన వేడుకలు శుక్రవారం తిరుపతి నగరంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్లో మున్సిపల్ ఉద్యోగులు మేయర్ డాక్టర్ శిరీషకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ అమరయ్య, రెవిన్యూ అధికారులు సేతు మాధవ్, రవికుమార్, ఇంజనీరింగ్ విభాగము టౌన్ ప్లానింగ్ ఇతర విభాగాల ఉద్యోగులు ఆమెకు పుష్పగుచ్చం ఇచ్చి అభినందనలు తెలియజేశారు. తిరుపతి తాతయ్య గంగమ్మ దేవస్థానం ఆలయంలో ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించి నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఆ తర్వాత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



క్రెడాయ్ ప్రాపర్టీ షో ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్


క్రెడాయి ప్రాపర్టీ ఎక్స్ పో తిరుపతిలో శ్రీ కన్వెన్షన్ హాలులో శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యింది. . తిరుపతి డిబిఆర్ ఆస్పత్రి రోడ్ లోని శ్రీ కన్వర్షన్ హాల్లో మూడు రోజులు పాటు ఈ కార్యక్రమం జరగనుంది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాసులు నగిరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ,తిరుపతి డిప్యూటీ మేయర్ ఆర్ సి మునికష్ణ పాల్గొని ప్రారంభోత్సవం చేశారు ఈ సందర్భంగా తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు మాట్లాడుతూ తిరుపతిలో క్రెడాయ్ ఏర్పడినప్పటి నుంచి తిరుపతి వాళ్లకు నాణ్యమైన నిర్మాణాలతోపాటు తిరుపతిలో రూల్స్ ప్రకారము అపార్ట్మెంట్స్ నిర్మిస్తున్నారని, అన్ని అనుమతులు కలిగి క్లియర్ టైటిల్ గల ప్రాపర్టీ కొనుగోలు చేయడానికి సరైన వేదిక ప్రాపర్టీ షో అన్నారు. ఈ అవకాశంను తిరుపతి ప్రజలు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. తిరుపతిలో 22ఏ నిషిద్ధం లో ఉన్న భూములు కూడా విడిపించి తిరుపతి క్రెడాయి వాళ్లకి అప్పజెప్తామని అన్నారు. గాలి భాను ప్రకాష్ మాట్లాడుతూ నాలా చట్టాన్ని రద్దు చేసిందని, అలాగే తిరుపతిలో బిల్డర్స్ కి సిమెంటు, స్టీలు తర్వాత గహ సంబంధించిన వాటిపై జీఎస్టీ లో తగ్గించిందని గుర్తు చేశారు. అన్ని ఒకే వేదికపై తీసుకురావడానికి కారణమైన క్రెడాయ్ ప్రతినిధులు చైర్మన్ గోపీనాథ్ ,ప్రెసిడెంట్ రాంప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ ఏ రాజశేఖర్ బాబు ,సెక్రటరీ నరసింహారెడ్డి ,ట్రెజరర్ హరికష్ణ తదితరులును ప్రశంసలతో కొనియాడారు. తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ విచ్చేసి స్టాల్స్ సందర్శించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రెడాయ్ వాళ్లు ప్రతి సంవత్సరం ఇలాంటి ప్రాపర్టీ షో నిర్వహించడం తిరుపతి ప్రజలకు ఎంతో ఉపయోగమని అన్నారు. క్రెడాయ్ చైర్మన్ గోపీనాథ్ , ప్రెసిడెంట్ రాంప్రసాద్ మాట్లాడుతూ 5, 6 ,7 తేదీలలో శ్రీ కన్వెన్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ప్రాపర్టీ షోను తిరుపతి ప్రజలు, జిల్లావాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ముస్లింల పవిత్ర పండుగ అయిన మీలాదున్నవి శుక్రవారం తిరుపతి నగరంలో ఘనంగా నిర్వహించారు. మీలాద్ తహ రిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కష్ణాపురం సర్కిల్ వద్ద, ప్రభుత్వ ఖజి సయ్యద్ షఫీ అహ్మద్ ఖాదర్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వైఎస్ఆర్సిపి మాజీ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి పేదలకు అన్నదానం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ప్రజలు సుఖ సంతోషాలతో ఆనందాలతో మంచి ఆరోగ్యంతో ఉండాలని కోరారు. షఫీ అహ్మద్ ఖాదిరి మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త ప్రేమ శాంతి కోసమే ఎక్కువ పాటు పడ్డారని కొనియాడారు. ముస్లింలు ఆయన అడుగుజాడల్లో నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ డైరెక్టర్ ఖాసిం సాహెబ్, మైనార్టీ నాయకులు చాంద్ బాషా, ముస్లిం మైనార్టీ నాయకులు ఇమ్రాన్ భాష, సాకం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.





లిక్కర్ స్కాంలో ... 'తరువాత' ఎవరు..?

'సిట్' విచారణతో 'వైసిపి'లో గుబులు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఎపి లిక్కర్ స్కాం కేసులో సిట్ దూకుడు పెంచింది. రూ.3,500 కోట్లకు పైగా స్కాం జరిగినట్లు గుర్తించిన సిట్ అధికారుల దర్యాప్తులో పలువురు జైలుపాలవుతున్నారు. ఇప్పటికే ధనంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డితో పాటు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి, చాణక్య, పైలా దిలీప్, బాలాజీ గోవిందప్ప ఈ కేసులో అరెస్టు అయ్యారు. పోలీసుల కష్టడీలో విచారణ ఎదుర్కొంటున్నారు. వీరితో పాటు మరో 39 మంది వరకూ సిట్ నిందితులుగా చేర్చింది. ఈ నేపథ్యంలో 'తరువాత' అరెస్టు ఎవరన్నది జిల్లాలో వైసిపి శ్రేణుల్లో రాజకీయ విభాగాల్లో చర్చ నడుస్తోంది. వైసిపిలోని కొందరు సీనియర్లు సైతం ఈ జిల్లాలో ఎవరెవరికి లిక్కర్ స్కాంలో లింకులు ఉన్నాయని ఆరా తీస్తుండటం గమనార్హం.

చంద్రగిరి మాజీ ఎంఎల్ఎ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వెంకటేష్‌నాయుడు అరెస్టు అయ్యారు. వారిద్దరి అరెస్టు తరువాత రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని సిట్ అరెస్టు చేసింది. ఇక చెవిరెడ్డి కుమారుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి లిక్కర్ కేసులో నిందితుడుగా ఉన్నారు. లిక్కర్ స్కామ్‌లో వచ్చిన ముడుపులను చంద్రగిరి సహా పలు నియోజకవర్గాల్లో ఎన్నికల సమయంలో పంచారని అభియోగాలను ఎదుర్కొంటున్నారు. చెవిరెడ్డి వ్యక్తిగత కార్యదర్శి బాలాజీతో పాటు కిరణ్‌కుమార్‌రెడ్డి, సైఫ్ అహ్మద్‌లపైనా కేసు నమోదయ్యింది. ఇప్పటికే అరెస్టయ్యి జైల్లో ఉన్న వీరందరినీ సిట్ విచారించింది. ఈ తరుణంలోనే ఎప్పటికప్పుడు కొత్తపేర్లు బయటకు వస్తున్నాయి. మాజీ డిప్యూటీ సిఎం నారాయణస్వామికి సైతం నెలరోజుల క్రితం ఆయనకు సిట్ నోటీసులు ఇవ్వడంతో అనారోగ్య కారణాల వల్ల వాట్సాప్‌లో పంపిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. దానికి సంతృప్తి చెందని సిట్ అధికారులు నేరుగా నారాయణస్వామి ఇంటికి వచ్చి ఆరు గంటలపాటు విచారణ జరిపారు. వైసిపి హయాంలో ఎక్సైజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన నారాయణస్వామి అరెస్టు అవుతారనే ప్రచారం జోరుగా సాగింది. రెవెన్యూ అధికారుల సమక్షంలో ఆయన వాంగ్మూలం రికార్డు చేసినట్లు తెలుస్తోంది. అయితే నారాయణస్వామి మాత్రం 'పైవారు చెబితే చేశా' అని చెప్పుకొచ్చారని సమాచారం. ఆయన ఎవరెవరి పేర్లు చెప్పారనేది సర్వత్రా ఉత్కంఠ.

విజయానందరెడ్డికి సిట్ నుండి పిలుపు

ఇక నారాయణ స్వామిని విచారణతో మాత్రమే సరి పెట్టడంతో అందరూ ఉపిరి పీల్చుకున్నారు.. అయితే ఊహించని విధంగా చిత్తూరు వైసీపీ ఇన్చార్జి విజయానందరెడ్డికి సిట్ నుండి పిలుపు రావడంతో విచారణకు హాజరయ్యారు. వైసీపీ హయాంలో మద్యం డిపోల నుంచి షాపులకు తరలించేందుకు ఆయన కాంట్రాక్టు పొందారనే సమాచారం. పొరుగు రాష్ట్రాల్లో రవాణా చేసే ట్రాన్స్ పోర్ట్ కంపెనీలకు ఇస్తున్న మొత్తం కన్నా ఎక్కువకు ఈ కాంట్రాక్టు దక్కించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల సమయంలో చెవిరెడ్డి సూచనల మేరకు లిక్కర్ ముడుపుల్ని వైసీపీ అభ్యర్థులకు విజయానందరెడ్డి చేరవేసినట్లు సిట్ గుర్తించింది. వీటన్నింటిపై సుదీర్ఘంగా సిట్ అధికారులు ప్రశ్నించినట్లు టాక్ నడుస్తోంది. అలా జిల్లాలో నగరిలో రోజాకు, తిరుపతి, కాళహస్తి, పూతలపట్టు, పీలేరు, జీడి నెల్లూరుకు అ నగదు చేరవేసినట్లు అనుమానిస్తున్నారంట. వీటిపై ఆయన మొదట తనకు ఏమీ తెలియదని, మద్యం సరఫరా కాంట్రాక్టు మాత్రమే చేశానని బుకాయించారంట. అయితే సిట్ అధికారులు చూపిన ఆధారాలతో గుట్టు విప్పక తప్పలేదంట. విజయానందరెడ్డిని సిట్ అధికారులు మరోసారి విచారణకు రావాలని చెప్పినట్లు సమాచారం. చిత్తూరు జిల్లాలో వరుసగా వైసీపీ నేతలను సిట్ విచారించడంతో తర్వాత ఏం జరుగుతుందోనని ఆ పార్టీ శ్రేణుల్లో టెన్షన్ నెలకొంది.

తిరుపతి మాజీ ఎమ్మెల్యే, టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి సైతం లిక్కర్ స్కామ్‌లో భాగం ఉందంటూ టిడిపి నేత పట్టాభి చేసిన వ్యాఖ్యలు జిల్లా వైసీపీలో మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇలా రాష్ట్రంలోనే అతిపెద్ద లిక్కర్ స్కామ్ గా చెబుతున్న కేసులో వరుసగా చిత్తూరు జిల్లాకు సంబంధించిన నేతలే చిక్కుకోవడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది.

5న భక్త కనకదాస కాంస్య విగ్రహం ఆవిష్కరణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

దాన శ్రేష్ట భక్త కనకదాస కాంస్య విగ్రహ ఆవిష్కరణ అక్టోబర్ 5వ తేదీ తిరుపతి బస్టాండ్ సమీపంలోని పూర్ణకుంభం కూడలి వద్ద జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్రీ దాన శ్రేష్ట శ్రీ శ్రీ శ్రీ కనకదాసవిగ్రహ కమిటీ కన్వీనర్ వెంకటప్ప, కో కన్వీనర్ మంగిరి రెడ్డప్ప కోరారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. భక్తి భావం ముక్తికి మార్గం అనే నినాదంతో చెన్నకేశవ స్వామి అనుగ్రహంతో తిమ్మప్ప భక్త కనకదాసుగా మారి దాసురులోకెల్లా శ్రేష్టుడై దాస శ్రేష్టుడైనారన్నారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ వారి తండ్రి రామచంద్రారెడ్డి జ్ఞాపకార్థం భక్త కనకదాసు కాంస్య విగ్రహాన్ని అందిస్తోందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో గౌరవ కన్వీనర్ పోతప్ప, నంజుడప్ప, ఆనంద, మల్లయ్య, నాగమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మోహన్ రెడ్డి మృతికి ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: స్థానిక మున్సిపాలిటీ పరిధి, చెర్లోపల్లికి చెందిన టిడిపి నాయకుడు లోకనాథ రెడ్డి తండ్రి మోహన్ రెడ్డి అనారోగ్యంతో శుక్రవారం కన్నుమూశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ వారి స్వగృహానికి వెళ్లి మోహన్ రెడ్డి మృత దేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట సింగిల్ విండో చైర్మన్, గ్రామస్తులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఆశా జిల్లా కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: సీఐటీయూ అనుబంధం, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా పి.లక్ష్మీ, ప్రధాన కార్యదర్శిగా ఎం.కవిత, కోశాధికారిగా కే.ఉషలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆశాలు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల హక్కుల సాధన కోసం నూతన కార్యవర్గం సమరశీల పోరాటాలు చేస్తుందని అధ్యక్ష, కార్యదర్శులు స్పష్టం చేశారు. ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ధనలక్ష్మి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య కార్యదర్శి పెనగడం గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం ఎస్ఐగా భక్తవత్సలం

ప్రజాశక్తి - రామచంద్రపురం: రామచంద్రపురం మండల పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్గా శుక్రవారం భక్తవత్సలం బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లా రాయచోటి, సంబేపల్లి పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఆర్ సి పురం పోలీస్ స్టేషన్కు వచ్చారు. శుక్రవారం బాధ్యతలు తీసుకున్న ఆయనకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

చలో విజయవాడకు తరలి రండి

ప్రజాశక్తి రామచంద్రపురం (చంద్రగిరి): విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 6న నిర్వహించనున్న ఛలో విజయవాడకు వేలాది మంది విద్యార్థులు తరలి రావాలని జిల్లా ఉపాధ్యక్షులు తేజ పిలుపునిచ్చారు. చంద్రగిరి మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ లో 6400 కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ చంద్రగిరి నాయకులు వరుణ్ కుమార్, మోహన్, రాజేష్ రెడ్డి, అరుణ్ కుమార్, దామోదర్ తదితరులు నాయకులు పాల్గొన్నారు.

నామకరణం వేడుకలో మంత్రి మండపల్లి

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి): మండలంలోని తొండవాడ సమీపంలో ఉన్న పి.ఎల్.ఆర్ కళ్యాణ మండపంలో శుక్రవారం జరిగిన మనవరాలు నామకరణ వేడుకలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. మంత్రి సోదరుడు మండిపల్లి ఉదయచంద్ర రెడ్డి కుమారుడు రాఘవేంద్రారెడ్డి కుమార్తె నామకరణ వేడుకకు ఆయ హాజరయ్యారు. తొండవాడ చెందిన మంత్రి వియ్యంకుల ప్రభాకర్ రెడ్డి, శాంతిలు మంత్రిని సత్కరించారు. స్థానిక నాయకులు పులికంటి మోహన్ రెడ్డి, జగ్గా రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు

ప్రజాశక్తి -పుత్తూరు టౌన్: గేట్ పుత్తూరులో ఉన్న ముఖద్దాస్‌లో ఈరోజు మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవితం గడపాలని అల్లా వేడుకున్నారు. ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ మంత్రి వర్గ విస్తరణలో మంత్రిగా అవకాశం రావాలని దువా చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రఫీ, అన్వర్, మహమ్మద్, నబీ, మహమ్మద్ రషీ, హమీద్ భాషా, శ ర్దార్, చాను, యూనిస్, జాఫర్, షకీల్, సలీం, ఖలీల్ పాల్గొన్నారు.

టీకాలతో పాడి పశువుల ఆరోగ్య రక్షణ

ప్రజాశక్తి-ఏర్పేడు: ఎండి పుత్తూరు, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ, పశు వైద్య కేంద్రం ఆధ్వర్యంలో ఎండి పుత్తూరు, చెల్లూరు గ్రామాలలో శుక్రవారం పశువులలో వివిధ రకాల వ్యాధులు, టీకాల ఆవశ్యకత గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారిని డాక్టర్ శిల్పారెడ్డి మాట్లాడుతూ పశువులలో వివిధ రకాల సీజనల్ వచ్చే వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవలసిన టీకాలు, ఉపాధి హామీ పథకం కింద ఉన్న బహువార్షిక పశు గ్రాసాల సాగు గురించి రైతులకు వివరించారు. అనంతరం బాహ్యపరాన్న జీవుల నివారణకు పిచికారీ మందు పిచికారి చేయించారు. ఈ కార్యక్రమంలో ఏటీఎం భార్గవి, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ పవన్ కుమార్ ,చంద్రశేఖర్, వాణి మరియు రైతులు పాల్గొన్నారు.

శ్రీరామలో ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి-రేణిగుంట మార్గంలోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో క్వాంటం టెక్నాలజీస్ పై గత ఐదు రోజులపాటు జరిగిన ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం శుక్రవారం ముగిసిందని కళాశాల డైరెక్టర్ మన్నెం అరవిందకుమార్ రెడ్డి తెలిపారు. ముగింపు కార్యక్రమానికి జేఎన్టీయూ అనంతపురం ఫ్యాకల్టీ డెవలప్మెంట్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ ప్రశాంతి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నూతన టెక్నాలజీపై విద్యార్థులకు బోధన చేయడం వలన నూతన ఆవిష్కరణలకు దోహదపడుతుందన్నారు. ప్రోగ్రాం కన్వీనర్ ప్రొఫెసర్ ముని శంకర్ మాట్లాడుతూ ఇటువంటి అవశ్యకత కలిగిన కార్యక్రమాన్ని నిర్వహించడానికి సహకరించిన శ్రీరామ కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ సందర్భంగా ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం కు హాజరైన వారికి సర్టిఫికెట్లు ప్రధానం చేశామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. జయచంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి , సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి కళాశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీసిటీని సందర్శించిన టెలికాం హనుమాన్ చౌదరి

ప్రజాశక్తి - సత్యవేడు: భారతదేశ టెలికాం విప్లవ ప్రముఖుడు, వివిసిఎన్ మాజీ చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ఐటీ సలహాదారు, పద్మశ్రీ డాక్టర్ టి.హనుమాన్ చౌదరి శుక్రవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ఆవిర్భావం, ప్రగతి, ప్రత్యేకతల గురించి వివరించారు. డాక్టర్ చౌదరి సందర్శన తమకు అత్యంత గౌరవప్రదం అని వ్యాఖ్యానించిన డాక్టర్ సన్నారెడ్డి, భారతదేశ టెలికాం విప్లవంలో ఆయన మార్గదర్శక పాత్ర ఎంతో స్ఫూర్తిదాయకం అన్నారు. 94 ఏండ్ల వయస్సులోనూ ఎంతో ఉత్సుకత, ఉత్సాహంతో శ్రీసిటీ పర్యటన రావడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఆయన విలువైన సలహాలు, సూచనలు శ్రీసిటీ అభివృద్ధికి, లక్ష్యానికి మరింత ప్రయోజనం చేకూర్చుతుందని చెప్పారు. ప్రపంచశ్రేణి పారిశ్రామిక కేంద్రం ఏర్పాటులో డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి దార్శనికతను డాక్టర్ టిహెచ్ చౌదరి అభినందించారు. శ్రీసిటీ సందర్శన ఒక అద్భుతమైన అనుభూతిగా పేర్కొన్నారు. 31 దేశాలకు చెందిన 240 కి పైగా గ్లోబల్ కంపెనీలు, 65 వేల మందికి ఉపాధి కల్పనతో భారత్ ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న శ్రీసిటీ ప్రగతిని ప్రశంసించారు. శ్రీసిటీ పర్యావరణ సీతాకల్ సమాజంతో పేర్కొన్నారు. డాక్టర్ చౌదరి, "మేడ్ సంపత్తి, జగద్గురు భారత్" అనే అంశంపై ప్రసంగం చేశారు. ప్రపంచ నాయకత్వం కోసం భారతదేశ వ్యూహాత్మక చిత్రాన్ని ఆయన వివరించారు.

విద్యాస్ వికాస్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు




ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా, బుచ్చినాయుడు కండ్రిగ మండలం, విద్యాస్ వికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో కరెస్పాండెంట్ విద్యాప్రకాష్ రెడ్డి అధ్యక్షతన, ప్రిన్సిపాల్ మేరీ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎంతో ఓర్పుతో పాఠాలు చెబుతూ, విద్యార్థులను ఉన్నత స్థాయిలో నిలిపే ప్రతి గురువు దైవంతో సమానం అన్నారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయుల ఆశీర్వాదాలు తీసుకుని, గురుపూజోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సుబ్బరామయ్యకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం




ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండల పరిధిలోని, ఈ బీసీ కాలనీకి చెందిన సుబ్బరామయ్య ఉత్తమ ఉపాధ్యాయుడుగా పురస్కారం అందుకున్నారు. బుచ్చినాయుడు కండ్రిగ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గతంలో పనిచేస్తూ ఎన్నో ఉత్తమ సేవ పురస్కారాలు అందుకున్న ఆయన మంచి ఉపాధ్యాయుడుగా పేరు గడించారు. అనంతరం వరదయ్యపాలెం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సైన్స్ ఉపాధ్యాయులుగా బదిలీపై వెళ్లి విద్యార్థులను ఆయన సబ్జెక్టులో మొదటి స్థానంలో నిలుపుతూ అక్కడ కూడా అందరి మన్ననలను పొందారు. కాగా ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా, తిరుపతి జిల్లాలో జరిగిన జిల్లా స్థాయి ఉపాధ్యాయ సన్మాన సమావేశంలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ దగ్గర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు.

వరలక్ష్మికి ఉత్తమ ఉపాధ్యాయురాలి పురస్కారం



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా చిల్లకూరు మండలం, చిల్లకూరు ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. పెంచపాడు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు చెంతాటి వరలక్ష్మిని ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేసి ఎంఈఓ, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు మిత్రులు శ్రేయోభిలాషులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు ఉపాధ్యాయులు కుటుంబ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ మండల విద్యాశాఖ అధికారిగా ఎంపికైన బాణాల మునిరత్నం



ప్రజాశక్తి - నాయుడుపేట: గురుపూజోత్సవ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా ప్రకటించే ఉత్తమ మండల విద్యాశాఖ అధికారి పురస్కారానికి నాయుడుపేట మండల విద్యాశాఖ అధికారి బాణాల మునిరత్నం ఎంపికయ్యారు. సెప్టెంబర్ 5వ తేదీ శుక్రవారం జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారుల చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. నాయుడుపేట మండల విద్యాశాఖ అధికారిగా విధులు చేపట్టినప్పటి నుంచి నాయుడుపేట లోని ఉపాధ్యాయులను, విద్యార్థులను నిత్యం అందుబాటులో ఉంటూ పట్టణ, మండల పాఠశాలల అభివృద్ధికి కృషి చేసిన ఆయన ఉత్తమ పురస్కారం అందుకోవడం ఆనందంగా ఉందని పలువురు ఉపాధ్యాయులు తెలియజేశారు. ఉత్తమ మండల విద్యాశాఖ అధికారిగా ఎంపికైన మునిరత్నంకు పట్టణ, మండల పరిధిలోని పాఠశాల ఉపాధ్యాయులు, ఆయన మిత్రులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలియజేశారు.

యంఈఓ కు ఉత్తమ జిల్లా స్థాయి అవార్డు



ప్రజాశక్తి - తడ: శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జరిగిన వేడుకల్లో జిల్లా స్థాయి ఉత్తమ మండల విద్యాశాఖ అధికారిగా తడ మండల విద్యాశాఖాధికారి మునిరత్నం రావు కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎల్. వి శారద, యస్.జీటీ, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, పల్లిపాలెం కు జిల్లా విద్యాశాఖ అధికారి, కలెక్టర్ చేతులమీదుగా అవార్డులను అందుకున్నారు. తడ మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా నాగవేణి, యంపిపియస్ రామాపురం కుప్పం, కె. రాంబాబు, యస్ జీ టి, యంపిపియస్ ఆర్ కొండాపురం శేష సాయి కుమారి, యస్ జీ టి (యంఆర్పి), యంపిపియస్ సుందరపురం, కె. సుహాస్ కుమార్, యస్ జీ టి, యంపిపియస్ యస్.యం కండ్రిగలు అవార్డులను అందుకున్నారు.

ఉత్తమ అధ్యాపకురాలుగా మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఆచార్య హేమ



ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయు మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఆచార్య హేమకు వర్సిటీ ఇన్చార్జి ఉపకులపతి ఆచార్య చిప్పాడ అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతినాయుడు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు 2025 బహుమతిని శుక్రవారం శ్రీనివాస ఆడిటోరియంలో ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్సిటీలో ఇంజనీరింగ్ ఆర్ట్స్ సైన్స్ మేనేజ్మెంట్ కళాశాలలో 2024–25 సంవత్సరానికి మంచి అకాడమిక్ పర్ఫామెన్స్ ప్రదర్శించిన ప్రతిభ కలిగిన ఆచార్యులను వర్సిటీ కమిటీ ఎంపిక చేసిందన్నారు. ఇందులో భాగంగా వర్సిటీలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో ఆచార్య హేమకు ఉత్తమ ఆచార్య అవార్డు అందించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

డాక్టర్ సి.భువనేశ్వరికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



ప్రజాశక్తి - క్యాంపస్ : డాక్టర్ సి. భువనేశ్వరి దేవి, రాష్ట్ర ప్రతిష్టాత్మక ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన సందర్భంగా కళాశాల అధ్యాపకులు, సిబ్బంది హృదయపూర్వక హార్దిక అభినందనలు తెలియజేస్తున్నారు. టిటిడి సంస్థ కూడా గర్వకారణంగా ఆమెను కొనియాడారు. ప్రస్తుతం తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఐ క్యూ ఎ సి కో ఆర్డినేటర్ మరియు లెక్చరర్ గా పనిచేస్తున్నారు.

పలువురికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు



అవార్డు అందుకుంటున్న గురవారెడ్డి, రామచంద్రయ్య

ప్రజాశక్తి-ఏర్పేడు: సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఏర్పేడు మండలంలో నలుగురికి దక్కాయి. పంగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న రామచంద్రయ్య, చిందేపల్లి ఎంపీపీ స్కూల్ సెకండరీ గ్రేడ్ టీచర్గా విధులు నిర్వహిస్తున్న గురవారెడ్డి, ఒడిమిట్ట హరిజనవాడ ఎంపీ స్కూల్ సోషల్ స్టడీస్ బోధిస్తున్న గోపి, ఏర్పేడు ఎంపీపీ స్కూల్ సెకండరీ గ్రేడ్ టీచర్ ఆదినారాయణలు జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకున్నారు.

రేణిగుంట -గుజరాత్.. 10 రోజుల యాత్ర

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: భారతీయ రైల్వే శాఖలో భాగమైన ఐఆర్సిటిసి తొలిసారిగా 10 రైళు సొంతం చేసుకుంది. ఈ సందర్భంలో అక్టోబర్ 7వ తేదీ నుంచి 10 రోజులపాటు ప్రత్యేక పర్యాటక రైలు ద్వారా భవ్య గుజరాత్ యాత్రను ప్రారంభించనున్నట్లు ఏరియా మేనేజర్ కె. వేణుగోపాల్ తెలిపారు. తిరుపతి రైల్వే స్టేషన్లోని ఐఆర్సిటిసి కార్యాలయంలో స్టేషన్ డైరెక్టర్ కూపాల సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ యాత్రలో గరిష్టంగా 639 మంది యాత్రికులు పాల్గొనవచ్చని చెప్పారు. ఈ యాత్రలో ద్వారక, నాగేశ్వర్ ఆలయం, సోమనాథ్ ఆలయం, అహ్మదాబాద్, మోఢేరా సూర్య దేవాలయం, సబర్మతి ఆశ్రమం, సబర్మతి నది తీరం, యూనెస్కో వారసత్వ క్షేత్రం రాణి కి వావ్, ప్రపంచ ప్రఖ్యాత స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వంటి పుణ్యక్షేత్రాలు, చారిత్రక ప్రదేశాలను దర్శించే అవకాశం ఉంటుందని వివరించారు. ప్రత్యేక పర్యాటక రైలు రేణిగుంట నుండి బయలుదేరి గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, ఖమ్మం, కాజీపేట, సికింద్రాబాద్, నిజామాబాద్, హజూర్ సాహెబ్ నాందేడ్, పూణే మార్గంలో ప్రయాణించి తిరిగి అదే మార్గం ద్వారా రేణిగుంట చేరుకుంటుందని తెలిపారు. యాత్రికులకు వసతి, ఆహార సౌకర్యాలు, ప్రయాణ బీమా కూడా అందించబడుతుంది. టికెట్ ధరలు:స్లీపర్ క్లాస్ రూ.18,400,3 టైర్ ఏసీ రూ.30,200, 2 టైర్ ఏసీ రూ. 39,900 అని తెలిపారు. టికెట్ల బుకింగ్ కోసం 92814 95853, 82879 32313 నంబర్లను సంప్రదించాలన్నారు.

గుంతకల్లు ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి - సత్యవేడు: గుంతకల్లు మండలంలో సోలార్ కంపెనీకి ప్రభుత్వం చేస్తున్న భూసేకరణలో రైతుల సమస్యలు తెలుసుకునేందుకు వెళ్లిన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ప్రభాకర్ రెడ్డిని గుంతకల్లు ఎమ్మెల్యే జయరాం ఫోనులో వ్యక్తిగతంగా బండ బూతులు తిడుతూ నీచమైన భాష ఉపయోగించడం దారుణమని తక్షణమే ఆయన క్షమాపణలు చెప్పాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్దన్ ప్రకటనలో డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగించే ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పై స్థానిక ఎమ్మెల్యే, రైతులకు న్యాయం చేయమని అడిగినందుకు బూతులు మాట్లాడటం దారుణమన్నారు. సీఎం జోక్యం చేసుకొని ఇలాంటి నాయకులను అదుపులో పెట్టాలని కోరారు.

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాల అమలు చేయాలి : సిఐటియు



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాల అమలు చేయాలని, జీవో నెంబర్ 1214 రద్దు చేయాలని, సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం పుత్తూరు మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద కర పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకుల మాట్లాడుతూ, 15వ తేదీన విజయవాడలో జరిగే లేబర్ కమిషనర్ ఆఫీస్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు పి.మునిరాజా, సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్‌లు మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీను అమలు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు పనులు జరిగే చోట రక్షణ కల్పించాలని అధికారులకు ఎన్నిసార్లు వినతులు సమర్పించినా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు ఏదైనా ప్రమాదం జరిగినా వారి కుటుంబాలకు న్యాయం జరగడం లేదని ఆరోపించారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుకు ప్రభుత్వం ఒక రూపాయి కూడా చెల్లించిన అవసరం లేదన్నారు. పది లక్షల పైబడిన నిర్మాణ సంస్థల నుండి భవన యజమానుల నుండి ఒక శాతం సెస్ రూపంలో వసూలు చేయబడుతోందని తెలిపారు. ఆ డబ్బులు, భవన నిర్మాణ కార్మికుల కార్డు రిజిస్ట్రేషన్ ఫీజులు కలిపి నేటికి దాదాపు 3 వేల కోట్ల రూపాయలు ఉన్నాయని, ఆ డబ్బును కార్మికులకే ఖర్చు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వస్తే భవన నిర్మాణ కార్మికులను ఆదుకుంటామన్న కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు ఆ దిశగా చర్యలు చేపట్టలేదన్నారు. భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో 15వ తేదీ, విజయవాడ, లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, గోవిందరాజు, వెంకటేశు, వేలు, జయచంద్ర, ఆనందు, మునెయ్య, హరి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా వైసీపీ



ప్రజాశక్తి - నాయుడుపేట: రైతుల శ్రేయస్సుకోసం ఐదేళ్లపాటు ఏనాడు ఎలాంటి కొరత లేకుండా ఆర్బికే సెంటర్ల ద్వారా నిత్యం ఎరువుల పంపిణీ చేసిన ఘనత వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని నాయుడుపేట వైయస్సార్సీపి పట్టణ అధ్యక్షులు కలికి మాధవ రెడ్డి, మండల అధ్యక్షులు ఒట్టూరు కిషోర్ యాదవ్‌లు పేర్కొన్నారు. యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్న రైతులకు, యూరియాను వెంటనే సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య నాయుడుపేట వైఎస్ఆర్సిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. 9వ తేదీన ఆర్డీవో కార్యాలయం ఎదుట జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలకు, రైతులకు పిలుపునిచ్చారు. నాయుడుపేట మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక మాట్లాడుతూ రైతులకు యూరియా కొరత లేకుండా చూడాల్సి బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. కలికి మాధవరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయం దండగ అని ప్రకటించిన చంద్రబాబు అందుకు తగ్గట్టుగా యూరియా కొరత సృష్టించి, రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. ఈ నెల 9వ తేదీ సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విజయ డైరీ డైరెక్టర్ కట్టా భవాని శంకర్ రెడ్డి, నాయుడుపేట మున్సిపల్ కౌన్సిలర్లు దారా రవి,కావేరి పాకం అశోక్ కుమార్,శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ గంధవల్లి.సిద్ధయ్య,పలువురు నాయకులు పాల్గొన్నారు.

బలిజల మనోభావాలను దెబ్బతీయద్దు

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి): సంచారజాతులైన దొమ్మరులను గిరి బలిజలనే పేరుతో ప్రభుత్వం ప్రకటించి, బలిజ కులస్తుల మనోభావాన్ని దెబ్బతీయొద్దని జాతీయ బలిజ సంఘం కార్యదర్శి పి.గోపి రాయల్, ఆర్ మునిరత్నం రాయల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వినతి పత్రాన్ని శుక్రవారం చంద్రగిరి తాహశీల్దారు శివరామ సుబ్బయ్యకు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బలిజలలో 18 ప్రధాన ఉప కులాలు, 60 ఉప కులాలు ఉన్నాయన్నారు. బలిజ కులాలు చారిత్రక నేపథ్యం కలిగినవన్నారు. సంఘంలో గౌరవప్రదంగా జీవనం సాగించే బలిజ ఉప కులాలలో దొమ్మర కులాన్ని గిరి బలిజగా ప్రకటిస్తూ జారీ చేసిన జిఓని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దొమ్మర కులానికి గౌరవస్థానం కలిగించడంలో తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే వారికోసం బలిజ కులాన్ని అగౌరవపరచటం చాలా బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు శ్రీరాం గోపి రాయల్, మునిచంద్ర రాయల్, రామినేని మునిరత్నం రాయల్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవక్ గ్రూప్ శిక్షణ మాడ్యూల్‌పై ఈఓ సమీక్ష

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఐఐఎం అహ్మదాబాద్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రణాళికా విభాగం నిపుణుల బృందం సంయుక్తంగా అభివృద్ధి చేసిన శిక్షణా మాడ్యూల్‌పై టీటీడీ ఈఓ జె. శ్యామలరావు శుక్రవారం సాయంత్రం సమీక్షించారు. టీటీడీ అదనపు ఈఓ సిహెచ్. వెంకయ్య చౌదరి, జేఈఓ వీరబ్రహ్మం, ప్రణాళికా విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, ఐఐఎం అహ్మదాబాద్ ప్రొఫెసర్లు ప్రొఫెసర్ విశ్వనాథ్, ప్రొఫెసర్ రామ్ మోహన్ వర్చువల్‌గా చేరడంతో తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ శ్రీవారి సేవ నాణ్యతను పెంచాలనే గొప్ప ఉద్దేశ్యంతో, సీఎం సూచనల మేరకు, ఇటీవలి కాలంలో అనేక సంస్కరణలను పరిశీలిస్తున్నామని తెలిపారు. పునరుద్ధరణ కార్యక్రమంలో భాగంగా 3వ తేదీన గ్రూప్ సూపర్‌వైజర్, సేవక్ ట్రైనర్ రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తును ప్రారంభించారు. శిక్షణ పొందిన శిక్షకులు సూపర్‌వైజర్లు, శ్రీవారి సేవకులకు శిక్షణ ఇచ్చేలా ప్రణాళిక సిద్ధ చేయాలని కోరారు. ఈ సమావేశంలో టిటిడి చీఫ్ పిఆర్ఓ డాక్టర్ టి రవి, డిఎఫ్ఓ, జిఎం ఐటి ఇంచార్జ్ ఫణికుమార్ నాయుడు, అన్ని ప్రాజెక్టుల ప్రోగ్రామ్ ఆఫీసర్, స్వేతా డైరెక్టర్ ఇంచార్జ్ రాజగోపాల్, ఇతరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

అదుపు తప్పి లారీ బోల్తా



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం, గొల్లపల్లి గ్రామ సమీపంలోని పంజాబీ డాబా వద్ద శుక్రవారం ఓ బోరు వెల్స్ లారీ అదుపుతప్పి బోల్తా పడింది. లారీ పక్క నుంచి ద్విచక్ర వాహనం అధిగమించే క్రమంలో, ఆ ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి, రోడ్డు ప్రక్కనున్న డివైడర్ను డీ కొట్టి లారీ బోల్తా పడిందని స్థానికులు తెలిపారు. స్వల్పంగా గాయపడిన బోర్ వెల్ కూలీలను స్థానికులు పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణాపాయం జరుగ లేదు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, ప్రమాదానికి గల కారణాలను పరిశీలించారు.

వరుస చోరీలతో హడల్



ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి): చంద్రగిరి మండలంలో దొంగలు రెచ్చిపోతుండడంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. చంద్రగిరి పట్టణ సమీపంలోని దిగువ రెడ్డివారి పల్లిలో గురువారం రాత్రి రెండు తాళం వేసిన ఇళ్లలో చోరీలు జరిగాయి. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ చోరీలో40 వేలు రూపాయల నగదు, 20 గ్రాముల బంగారం, 2.5 కేజీల వెండి దొంగలు దోచుకు వెళ్లినట్లు సమాచారం. ఈ మేరకు బాధితులు గీతా, ఈశ్వర్ పోలీసులకు ఫిర్యాదు చేసారు. ఇటీవల రెండు మూడు ఇండ్లలో దొంగతనాలు జరిగినా ఇప్పటివరకు దొంగలను పట్టుకోకపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చంద్రగిరి పోలీస్ సర్కిల్‌కు సర్కుల్ ఇన్స్పెక్టర్ లేరు, ఇంచార్జ్ సర్కిల్ ఇన్స్పెక్టరే దిక్కు. చంద్రగిరి పోలీస్ స్టేషన్ కావాల్సిన పోలీస్ సిబ్బంది లేకపోవడంతో, రాత్రి వేళల్లో పోలీసులు గస్తీలు తిరగలేక పోతున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

8 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): రేణిగుంట–మామండూరు మార్గంలో ఎర్రచందనం అక్రమ రవాణా సమాచారంపై శుక్రవారం తిరుపతి రేంజ్ అటవీ శాఖ అధికారి సుదర్శన్ రెడ్డి పెట్రోలింగ్ నిర్వహించి 8 ఎర్రచందనం దుంగలను, ఒక కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పులిచెర్ల వద్ద ఏపీ 39 సి7116 నంబర్ గల కారు వేగంగా రావడాన్ని గమనించి కారు ఆపే ప్రయత్నం చేయగా స్మగ్లర్లు వేగంగా కారును నడిపి ముందుకు పోయారని, వారిని వెంబడించి చైతన్య పురం చెక్ పోస్ట్ సమీపంలో కారు ఆపి పారిపోయారన్నారు. కారులో పరిశీలించగా 227 కేజీల 8 ఎర్రచందనం దుంగలు ఉన్నాయన్నారు. వీటి విలువ బహిరంగ మార్కెట్లో రూ.5 లక్షల రూపాయల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఈ దాడులలో ఎఫ్బిఒ చంగల్రాయనాయుడు, ప్రొటెక్షన్ వాచర్ సిసింద్రీ, వెంకట్, రవి, ప్రసాద్ పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తుతెలియని మహిళ మృతి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రైలు కిందపడి గుర్తు తెలియని మహిళ (40) మృతి చెందిన సంఘటన శ్రీకాళహస్తి రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున వెలుగు చూసింది. మృతురాలి మెడలో ఎలాంటి తాళిబొట్టు లేదనీ, కేవలం ఒక నలుపుతాడు మాత్రమే ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మృతురాలి వివరాలు తెలిస్తే సెల్ 94412 45189 నంబరుకు సమాచారం అందించాలని హెడ్ కానిస్టేబుల్ నరసింహులు కోరారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి




ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రెండో పట్టణ పరిధి, కోర్టు సెంటర్, బస్ స్టాండ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ వివరాల మేరకు మృతుడికి 55 సంవత్సరాలు ఉంటుందన్నారు. సిమెంట్ రంగు చుక్కల పుల్‌హ్యాండ్ చొక్కా, నీలి రంగు మాసిన ప్యాంటు, కుడి చేతికి నీలి రంగు బ్యాండ్, చామన ఛాయ రంగు, సుమారు 5.2 అడుగులు ఎత్తు ఉన్నాడని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్నట్లు స్థానికులు గమనించారు. వెంటనే 108 అంబులెన్స్ ద్వారా గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మరణించాడన్నారు. మృతుడిని ఎవరు గుర్తించినా లేదా ఆయన బంధువులు/స్నేహితులు తెలిసిన వారు ఎవరైనా ఉంటే, గూడూరు టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ నెంబర్ 9440796343, సబ్ ఇన్స్పెక్టర్ 9491923229. నంబర్లకు సంప్రదించాలన్నారు.

మిగిలిన 6 బార్లకు 14న దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన బార్ పాలసీలో తిరుపతి జిల్లాలో శ్రీకాళహస్తి, గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి ప్రాంతాలలో మిగిలి ఉన్న ఆరు బార్లకు 14న దరఖాస్తులను అందివ్వాలని, 15వ తేదీన జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఓపెన్ క్యాటగిరీ పద్ధతిలో బార్లను కేటాయించడం జరుగుతుందని జిల్లా ఆప్కారి అధికారి నాగమల్లేశ్వర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. నూతన బార్ పాలసీ షరతులు వర్తిస్తాయన్నారు.

రైల్వే గేటు మరమ్మతు.. నిలిచిన వాహనాలు



ప్రజాశక్తి- కలకడ/ చంద్రగిరి: రైల్వే గేటు మరమ్మతుకు గురికావడంతో వాహనాలు కిలోమీటర్ మేర బార్లు తీరాయి. బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం, నర్సింగాపురం వద్ద ఉన్న రైల్వే గేటు తరచూ మరమ్మతులకు గురి కావడంతో ఇటు వాహనదారులు, అటు ప్రయాణికులు ఇబ్బంది తప్పడం లేదని పలువురు ఆగ్రహానికి గురవుతున్నారు. రైల్వే అధికారులు ఈ గేటు గురించి పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపించారు. బస్సుల్లో ప్రయాణిస్తున్న ఉద్యోగస్తులు డ్యూటీలకు వెళ్లాలంటే, ఆలస్యమవుతోందని తెలిపారు. రైల్వే సిబ్బంది, అధికారులు నరసింగా పురం రైల్వే గేట్‌కు శాశ్వత పరిష్కారం చేయాలని కోరుతున్నారు.

ఈవినింగ్ క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి -కోట : కోట మండలం, విద్యానగర్, కాలేజీ రోడ్‌లో జనతా క్లినిక్ వారి ఆధ్వర్యంలో ప్రజలకు అందుబాటులో ఈవినింగ్ క్లినిక్ నూతనంగా ప్రారంభించడం జరిగిందని కోట జనతా క్లినిక్ ఆసుపత్రి డాక్టర్ జగదీష్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యానగర్ చక్రవర్తి సైకిల్ షాప్ ఎదురుగా కాలేజీ రోడ్డులో ప్రతిరోజు సాయంత్రం మూడు నుండి రాత్రి 8 గంటల వరకు డాక్టర్ అందుబాటులో ఉంటారన్నారు. ప్రత్యేకంగా విష జ్వరాలు, స్త్రీ సంబంధిత వ్యాధులు, బిపి, షుగర్ చిన్న పిల్లల ఆరోగ్య సమస్యలపై చికిత్స చేయబడుతుందన్నారు.

సజ్జల భార్గవ్‌రెడ్డి అతీతుడు కాదు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) గత వైసీపీ ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా ప్రజల ప్రాణాలతో నకిలీ మద్యం తయారు చేసి అమ్మకాలు జరిపి కోట్లు వెనకేసుకున్న వారు ఎవరూ శిక్ష నుండి తప్పించుకోలేరని, అలానే సజ్జల భార్గవ్ రెడ్డి చట్టానికి అతీతుడు కాడన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని శాప్ చైర్మన్ రవి నాయుడు అన్నారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం వైసీపీలో ఏ హోదాలో ఉన్నాడో తెలియని సజ్జల రామకృష్ణారెడ్డి సీఎం చంద్రబాబును, మంత్రి నారా లోకేష్ పై అనుచిత పదజాలంతో దూషించడం పట్ల తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇకపై ఇలా నోరు జారి మాట్లాడితే అందుకు తగ్గట్టుగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు.

దేవాలయాల భూములు కాపాడాలి: స్వరూపానంద

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): దేవాలయాల భూములను రాజకీయ నాయకులు అన్యాక్రాంతం చేయడం దారుణమని, సదరు భూములను కాపాడడానికి ఫోరం ఫర్ హిందూ లాయర్స్ అండ్ ఇంటలెక్చువల్ సంస్థను స్థాపించామని లలిత పీఠాధిపతి స్వ స్వరూపానంద స్వామి తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్యాక్రాంతమవుతున్న మఠాలు, దేవాలయాలకు సంబంధించిన భూములను పరిరక్షించుకోవడానికి న్యాయవాదుల సహాయ సలహాలతో అరికట్టాలని 14 మంది పీఠాధిపతులు కలసి ఈ ఫోరంను స్థాపించామన్నారు. ఈనెల 14వ తేదీ విజయవాడ తుమ్మలపల్లిలో స్వామీజీలతో హిందూ న్యాయవాదుల ధర్మ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. విజయవాడలో జరిగే కార్యక్రమంలో ఒక వెబ్సైట్ లాంచ్ చేసి అందులో హిందూ దేవాలయ భూముల వివరాలు పొందుపరుస్తామన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE CUM JUDICIAL FIRST CLASS MAGISTRATE :: PUTTUR
E.P.No.78/2022, O.S.No.32/2021

Between:
P. Nagoor Naidu ...D.Hr
And:
1. V. A.Masthani(Died)
2. V.A.Vahabuddin.
3. V.Taasicem ...J.Drs

NOTICES SUMMONS TO THE JUDGMENT DEBTORS Nos. 2 & 3

To,
1. V.A.Vahabuddin, S/o. Late V.A.Rafi, Muslim, aged about 24 years, Landlord,
2. V.A.Taasiem, S/o V.A.Rafi, Hindu, aged about 24 years, Landlord,

Both Respondent/ JDrs are Residing at D.No.1/42, Shop Street, Puttur Post and Town, Tirupathi District.

Please take notice that the EP filed against you, for recovery of EP amount by the DHr, same is posted to 11.09.2025 for your appearance. If you have got any objections you may appear before the above said Court at 10.30 A.M. on 11.09.2025, either in person (or) through an Advocate and file your objections, if you fail to do so, the matter will be decided ex-parte.

Sri N. NADHAMUNI, LL.M.,
Advocate for the Plaintiff Puttur.

In The Court of The Senior Civil Judge : Gudur
I.P.No. 39 / 2025

Kunchala Santhamma - Petitoner
Vs
1. Eeduru Venkata Krishna
2. Batthala Kavitha
3. Eduru Penchalamma
4. Eduru Sekhar Babu
5. Eduru Govardhan - Respondents

జనరల్ నోటీసు

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా పై నెంబరు పిటిషనరు అయిన **Kunchala Santhamma** బాకీ రాబట్టుకొను నిమిత్తం రెస్పాండెంట్లుపైన పై వారి కోర్టులో **I.P. No. 39/2025** ను పిటిషన్ దాఖలు చేసియున్నందున సదరు I.P. పిటిషన్‌లో ఎవ్వరికైనను ఎలాంటి ఆక్షేపణలు ఉన్న యెడల **తేది:9-9-2025** న వాయిదా వేసియున్నారు. ఆరోజు **ఉదయం 10.30 గంటలకు** మీరు స్వయంగా గానీ వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపు కొనవలసింది యావన్మందికి తెలియజేయడమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
ఎ.వి.రాఘవరెడ్డి, బి.కాం., బి.ఎల్.,
పిటిషనర్ తరపు అడ్వకేట్, నెల్లూరు.
సెల్: **70132 05831**

ఎరువుల వాడకంపై అవగాహన

ప్రజాశక్తి - రామచంద్రపురం: రైతులు భూసార ఫలితాలను అనుసరించి ఎరువులు వాడకం చేపట్టాలని, భూమాత రక్షణపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారిణి బి. మమత పేర్కొన్నారు. శుక్రవారం మిట్టూరు కమ్యూనిటీ హాల్‌లో భూమాత రక్షణ పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తప్పక భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. భూ సారాన్ని బట్టి ఎరువులు వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మురళీమోహన్, సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

కృష్ణయ్యకు బియ్యపు పరామర్శ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి :అక్కుర్తి సర్పంచి మల్లం కృష్ణయ్యను మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు. కృష్ణయ్య ఇటీవల గుండెపోటుకు గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న మధుసూదన్ రెడ్డి కృష్ణను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆహార నియమాలు పాటించాలనీ, త్వరగా కోలుకుని రాజకీయ జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు.

మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించాలి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మహిళలు ఆర్థిక పరుపుష్టి సాధించాలని, సిటిజన్స్ వెల్ఫేర్ ఫోరం సంస్థ రాష్ట్ర ప్రధాన కోలా వెంకటేశ్వర రావు అన్నారు. సిటిజన్ వెల్ఫేర్ ఫోరం ఆధ్వర్యంలో టైలరింగ్ అండ్ ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు శుక్రవారం సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉండాలనీ, స్వయం ఉపాధితో ఆర్థిక పరిపుష్టి సాధించాలని వెంకటేశ్వరరావు తెలిపారు. సంస్థ అధ్యక్షులు బాలాజీ, సభ్యులు అనిల్ కుమార్, కోలా సంగీతారావు, విజయ లక్ష్మి వరలక్ష్మి, ప్రసాద్, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

చేతిబోరు మరమ్మతు

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు మండలం, యం డి పుత్తూరు, కైనగడ్డలో తాగునీటి చేతిబోరు మరమ్మతులకు గురై, నీళ్ల రావటం లేదని కైనగడ్డవాసులు సర్పంచ్ మోహన్ ప్రియకు తెలియచేసారు. అంతట సర్పంచ్ మోహనప్రియ మెకానిక్‌ను పిలిపించి పరిశీలించగా పైపులు పూర్తిగా తుప్పు పట్టాయని తెలుఎగా, కొత్త పైపులు, పుట్‌బాల్ తెప్పించి మరమ్మత్తులు చేయించారు. కైనగడ్డవాసులు సర్పంచికి కృతజ్ఞతలు తెలియజేశారు.

రేపు వికృతమాలలో లబ్ధిదారుల జనరల్ బాడీ మీటింగ్

ప్రజాశక్తి-ఏర్పేడు: వికృతమాల ప్రభుత్వ గృహ సముదాయాలలో లబ్ధిదారులును గుర్తించి తిరుపతి, పరిసర ప్రాంతాలలో నివాసముంటున్న పేద ప్రజలకు అనాటి, ఇప్పుడు అధికారంలో ఉన్నా తెగుదేశం పార్టీ 1800 మందికి ఇళ్లను కేటాయించడం జరిగింది. వికృతమాల గృహసముదాయంలో వసతులు లేవని చాలామంది లబ్ధిదారులు ఇళ్లలో నివాసం ఉండటానికి ముందుకు రావడం లేదు. మౌలిక సదుపాయలకోసం ఆదివారం 7వ తేదీ మధ్యాహ్నం 3 గంటకు వికృతమాల ప్రభుత్వ గృహల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో లబ్దిదారుల జనరల్ బాడీ సమావేశం నిర్వహిస్తున్నట్లు శివయ్య తెలిపారు.

ముక్కంటి సేవలో పలాస ఎమ్మెల్యే

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష శుక్రవారం కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వారాలయానికి విచ్చేశారు. వీరికి ఆలయ ఏఈఓ మోహన్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. గురు దక్షిణామూర్తి ఆలయ వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలికి ముక్కంటి తీర్థప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు.

కార్మికుల అభ్యున్నతికి కృషి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :రాష్ట్రంలో సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల ఆర్థిక అభివృద్ధికి, హోంగార్డ్స్, ఆశా వర్కర్ల, అంగన్వాడి కార్యకర్తల ఉద్యోగ భద్రతకు తన వంతు కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన భారతీయ జనతా మజ్దూర్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం గుంటూరు లోని భారతీయ జనతా మజ్దూర్ సంఘ్ రాష్ట్ర కార్యాల యంలో జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దిశెట్టి శామ్యూల్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకొని నూతన అధ్యక్షునిగా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించా రు. ప్రమాణ స్వీకారం అనంతరం మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ భారతీయ జనతా మజ్దూర్ సంఘ్ కార్మికులు వారి కుటుంబ సభ్యుల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధికి పాటుపడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో బీజేఎంఎస్ జాతీయ అధ్యక్షులు శాంత్ ప్రకాష్ జాటవ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గూడూరు లక్ష్మి వర ప్రసాద్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, స్థానిక డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (అపుస్మా)ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి, సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అపుస్మా గూడూరు నియోజకవర్గ అధ్యక్షులు జీవీ పవన కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, బాలకృష్ణం రాజు, దశరధరామిరెడ్డి,బాల చెన్నయ్య, సురేష్ బాబు, రూపవతి,తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమాజ దిక్సూచి గురువు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:మంచి సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుడు దిక్సూచీగా నిలుస్తున్నాడని యూటీఎఫ్ శ్రీకాళహస్తి డివిజన్ కన్వీనర్ సీ.వెంకటకృష్ణ పేర్కొన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో శుక్రవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి డివిజన్ పరిధిలో విద్యాభివృద్ధికి పాటు పడిన ఉపాధ్యాయులు జయప్రకాష్, ముద్దు కృష్ణ, రవీంద్రా రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, నటరాజన్, విజయ్ భాస్కర్, పుష్పలత, వాసవీ లత, సుమతి, మార్టిన్, సంబంధం శెట్టి, లక్ష్మీ ప్రసాద్, విజయరాణిలను ఘనంగా సత్కరించి, యూటీఎఫ్ పురస్కారాలను అందజేశారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు, కార్యవర్గ సభ్యురాలు డి.నిర్మల, రామచంద్రయ్య, హేమాంభర దరరావు, సూర్యప్రకాష్, జీ. శ్రీనివాసులు, మధు, మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పూర్వ విద్యార్థుల సత్కారం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం, పరమేశ్వర మంగళం, ఎస్ కే యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఎస్ సి 2005లో చదువుకున్న విద్యార్థులు శుక్రవారం గురుపూజోత్సవ సందర్భంగా తమ గురువులను ఘనంగా సత్కరించారు. పాఠశాలకు క్రీడా సామగ్రి వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి తిరుమల రాజు, బాలసుబ్రమణ్యం, పాఠశాల పదవులు ఉపాధ్యాయులు చంద్రశేఖర్ శెట్టి, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల చేతుల్లోనే దేశ భవిష్యత్తు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : విద్య నేర్పించిన గురువులను ఎన్నటికీ మరవకూడదని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పేర్కొన్నారు. గూడూరు, జడ్పీ బాయ్స్ హై స్కూల్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన పలువురు టీచర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎంపిడిఓ మోహన్ రావు, ఎంఈఓ కాంచన ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు .

ఘనంగా సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి వేడుకలను తిరుపతి బ్రాహ్మణ పరిషత్, బాలాజీ డిస్ట్రిక్ట్ బ్రాహ్మణ సేవ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక విశ్వం టాలెంట్ స్కూల్ వరదరాజ నగర్‌లో ఘనంగా నిర్వహించారు. బ్రాహ్మణ సంఘం నేతలు, తిరుపతి బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షులు సంస్కార్ రాజేష్ విశ్వం స్కూల్ విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రైవేట్ పాఠశాల జెయింట్ సెక్రటరీ, బాలాజీ డిస్ట్రిక్ట్ బ్రాహ్మణ సేవ సొసైటీ కార్యదర్శి విజయకుమార్ కృష్ణమూర్తి , కుడుముల శైలేంద్ర, తిరుపతి బ్రాహ్మణ పరిషత్ వైస్ ప్రెసిడెంట్ సాయి ప్రసాద్, టెన్నిస్ అకాడమీ రాజు, తిరుపతి బ్రాహ్మణ పరిషత్ కార్యదర్శి పవన్ అంగర, తితిదే ప్రసాద్, ప్రొఫెసర్ రాధా, కపిల తీర్థం తర్పణ సంఘం కార్యదర్శి పార విజయ కుమార్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

స్విమ్స్‌లో ఉపాధ్యాయ దినోత్సవం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీ పద్మావతి ఆడిటోరియంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశిన డైరెక్టర్ జాయింట్ రీప్లేస్మెంట్ అండ్ ఆర్థోపిడిక్ ఫోర్టిస్ ఎస్ కార్ట్ హాస్పిటల్స్, న్యూడిల్లీ నుండి విచ్చేసిన డాక్టర్ కౌశల్ కాంత్ మిశ్ర మాట్లాడుతూ.. దేశ సమగ్రాభివృద్ధిలో గురువుల పాత్రకు ప్రాధాన్యత ఉందన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రొఫెసర్ నెప్రాలజీ డాక్టర్ శివకుమార్, సీనియర్ ప్రొఫెసర్ న్యూరో సర్జరీ బి.సి.ఎం. ప్రసాద్, స్విమ్స్ డీన్ డాక్టర్ అల్లాడి మోహన్, కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజశేఖర్‌లు మాట్లాడుతూ సమాజానికి జ్ఞానాన్ని అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదని కొనియాడారు. అనంతరం ముఖ్య అతిథులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన వైద్యులు, ఫ్యాకల్టీ, విద్యార్థిని, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధ వచ్చినా గురువు స్థానం పదిలం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో శుక్రవారం డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ సి.ప్రకాష్ బాబు ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పులమాలవేసి, పుష్పాంజలి అర్పించారు. కళాశాల అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రకాష్ బాబు మాట్లాడుతూ కృత్రిమ మేధ ఎన్ని సవాళ్లు విసిరినా, గురువు స్థానం పదిలమన్నారు. ఈ కార్యక్రమంలో, అధ్యాపకులు, పి. ప్రియవర్ధనబాబు, వై.గంగాధరరావు, వార్డెన్ సి. శ్రీనివాసులు నాయుడు, డిప్యూటీ వార్డెన్ కె. సోమ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్య వెలుగుని పంచిన గురువులకు సత్కారం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పుత్తూరు, కృష్ణానగర్లో వున్న విశ్రాంత ఉపాధ్యాయురాలు లోకేశ్వరిని శుక్రవారం ఆమె శిష్యులు వారి ఇంట్లో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు బలిజ సంఘం నాయకుడు, జాతీయ కాపు సంఘం జాతీయ ప్రచార కార్యదర్శి పి. గోపి రాయల్ ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా బలిజ సేన అధ్యక్షుడు శ్రీరామ్ గోపి రాయల్, బలిజ సంఘం నాయకులు మునిరత్నం, పి. లోకనాథం రాయల్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ హెడ్మాస్టర్‌కు సన్మానం

ప్రజాశక్తి -ఏర్పేడు : 1977లో ఏర్పేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెడ్మాస్టర్‌గా పనిచేసిన ఎంఎ రంగనాథంను అప్పుడు10వ తరగతి చదివిన విద్యార్థులు గురుపూజోత్సవం సందర్భంగా శుక్రవారం ఘనంగా సన్మానించారు. 95 సంవత్సరాల రంగనాథంకు పాద పూజ చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు టి.నారాయణరెడ్డి, ఎస్ జంగయ్య, బి గోవిందస్వామి, జే. వెంకటరమణ, ముని కృష్ణారెడ్డి, సి.చంద్రశేఖర్ రెడ్డి, ఏ చంద్రశేఖర్ రెడ్డి, శంకర్, టిసి భత్తిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు నివాళి

ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట, ఆషా స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం, సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జూలియన్ రాజు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిని దైవంగా భావిస్తూ విద్యాబోధన చేస్తున్న గురువులను గౌరవించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆషా స్వచ్ఛంద సంస్థ ముఖ్య సలహాదారులు అమ్ములు రాజు, ధనంజయ నాయుడు పాల్గొన్నారు.

ఎస్వీయూలో విశ్రాంతాచార్యుల ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయులోని విశ్రాంత ఆచార్యుల సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఉదయం సెనేట్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి విసి ఆచార్య అప్పారావు మాట్లాడుతూ డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యాభివృద్ధికి చేసిన కృషిని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, విశ్రాంత ఆచార్యులు సంఘం అధ్యక్షుడు ఆచార్య పాపారావు, ఆచార్య కోదండరామిరెడ్డి, సంయుక్త కార్యదర్శి ఆచార్య మునిరత్నం, విశ్రాంత ఆచార్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివి: చింతా రాజేంద్ర

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్(తొట్టంబేడు): సమాజంలో గురువుకు ఏనలేని ప్రాధాన్యత ఉన్నదని వారి సేవలు సమాజంలో వెలకట్టలేనివని దళిత మహాసేన రాష్ట్ర అధ్యక్షులు చింతా రాజేంద్ర పేర్కొన్నారు. మండలంలోని అమ్మ ఆశ్రమలో శుక్రవారం విశ్రాంతి ఉపాధ్యాయురాలు సరోజనమ్మ, సరస్వతమ్మ, భూదేవిలను దళిత మహాసేన రాష్ట్ర అధ్యక్షులు చింతా రాజేంద్ర, జాతీయ హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షులు వీరేంద్ర ఆచారి శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మానాన్న తర్వాత గురువు స్థానం చాలా గొప్పదన్నారు.

వినాయకుని లడ్డు వేలం



ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి, ఎల్బి నగర్‌లో స్థానికులు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం నిమర్జన సమయంలో స్వామి వారి పూజలో వుంచిన 20 కిలోల లడ్డు వేలంలో అత్యధిక ధర పలికింది. గురువారం రాత్రి జరిగిన లడ్డు వేలంలో 1,06,100 రూపాయలతో శ్రీకాకుళం జిల్లా టెక్కలి వాస్తవ్యులు శ్రీనివాస హరిహరన్ అనే భక్తుడు లడ్డును సొంతం చేసుకున్నాడు. ఈ కార్యక్రమంలో ఎల్బి నగర్ యువత, సభ్యులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానిక త్యాగరాజావీదిలోని శ్రీ కళ్యాణవీరభద్ర స్వామి దేవస్థానంలో, రెడ్ సంస్థ ఆద్వర్యంలో ఇన్నర్ వీల్ అండ్ ఆంధ్రమహిళా మండలి వారి సహకారంతో 37 మంది పేద వికలాంగులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి దాతలుగా సౌందర్యమ్మ ఐదు వేల రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు బి మాధురి, కార్యదర్శి లక్ష్మీ, స్నేహలత, శశిరేఖ, జీవని, తదితరుల పాల్గొన్నారు.అనంతరం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆంధ్రా మహిళా మండలి ఇన్నర్ వీల్ క్లబ్ సంయుక్తంగా దివ్యాంగులైన ఉపాధ్యాయులు రంగయ్య, హరిత, ఉపాధ్యాయిని ఆంధ్రా మహిళా మండలి సీనియర్ మెంబర్ శశికళను సన్మానించారు.

మెరుగైన సేవలకే 'మన మిత్ర'


ప్రజాశక్తి - గూడూరు టౌన్ :డిజిటల్ గవర్నెన్స్ పేరుతో ప్రభుత్వం మన మిత్ర వాట్స్ యాప్ నెంబర్ 9552300009 ద్వారా సేవల వినియోగంపై సచివాలయం ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పిస్తారని, మన మిత్ర వాట్స్ యాప్ నెంబర్ ద్వారా 709 సేవలను చేపట్టనున్నట్లు ఎఫ్.ఏ.సి ఎం.పి.డి.వో మోహన్ తెలిపారు. వివిధ రకాల పనులకు కార్యాలయాలకు వెళ్లకుండా మన మిత్ర వాట్సాప్ నెంబర్ ద్వారా పనులు చేసుకునే సౌకర్యం కల్పించినట్లు తెలిపారు.

టీటీడీ నాదస్వర, డోలు విద్యార్థులకు డిపాజిట్ చెక్కుల పంపిణీ



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి, శ్రీ వెంకటేశ్వర సంగీత నృత్య కళాశాల ప్రాంగణంలో నాదస్వర డోలు విద్యార్థులకు శుక్రవారం చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. టీటీడీ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర నాదస్వరం, డోలు పాఠశాలలో ఆరేళ్ల సర్టిఫికెట్, డిప్లమా కోర్సులను పూర్తి చేసిన విద్యార్థులకు (2017-23, 2018-24 బ్యాచ్‌లకు చెందినవారు) ఒక్కొక్కరికి రూ. లక్ష చొప్పున డిపాజిట్ చేసిన చెక్కులను అందజేశారు. మొత్తం 46 లక్షల 20 వేల రూపాయల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమాముద్దుబాల, నాదస్వర పాఠశాల లక్ష్మీ సువర్ణ, విద్యాశాఖ డీఈవో కార్యాలయం సూపరింటెండెంట్ శివ కుమార్ లు పాల్గొన్నారు.

గోవర్ధన్ రెడ్డి మాతృమూర్తికి మాజీ ఎమ్మెల్యే నివాళి



ప్రజాశక్తి -ఏర్పేడు : మాజీ ఎంపీటీసీ, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు గోవర్ధన్ రెడ్డి మాతృ మూర్తి ఆకస్మికంగా చెందారు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పంగూరులో మృతురాలికి నివాళులర్పించి, కుటుంబాన్ని పరామర్శించారు. సర్పంచ్ పోలయ్య, వెంకట కృష్ణారెడ్డి, నాగార్జున రెడ్డి, కిరణ్, రాజేష్ తదితరులు కూడా నివాళులర్పించారు.